అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం 27 ఏప్రిల్ 2023

పోటీ పరీక్షల అభ్యర్థులకు గ్రంథాలయంలో అన్ని వసతులు



నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలు, వసతులు కల్పించినట్లు ఇంచార్జ్ గ్రంథాలయ అధికారిని భాగ్యశ్రీ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ ఆధ్వర్యంలో పుస్తకాలు వచ్చినట్లు, పోటీ పరీక్షలకు వచ్చే అభ్యర్థుల కోసం చదువుకోవడానికి వీలుగా అదనంగా కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



లింగంపేట్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

నవతెలంగాణ-లింగంపేట్/ఎల్లారెడ్డి

కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం లింగంపేట్, ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. లింగంపేట్ పోలీస్‌స్టేషన్ నందు గల రికార్డ్స్‌ను తనిఖీ చేసి కేసులను తొందరగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. కేసులు పెండింగ్‌లో పెట్టొద్దని తెలిపారు. మహిళల పట్ల జరిగే నేరాలను దొంగతనం కేసులను తొందరగా పరిష్కరించాలని ఆయన సూచించారు. పోలీసులు ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ పనితీరును చూసి అభినందించారు. ఇందులో ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్, ఎల్లారెడ్డి సిఐ శ్రీనివాస్, లింగంపేట్ ఎస్సై శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 41 వేల ఎకరాల్లో పంట నష్టం



లింగంపేట్‌లో పంట నష్టపోవడంతో మహిళా రైతు కంటతడి

- ఇంకా నీళ్లలోనే పంటలు
- చేతికొచ్చిన పంట నీటమునక
- లబోదిబోమంటున్న రైతాంగం
- ఆర్థికంగా చితికిపోయిన రైతన్న
- సర్కారు ఆదుకోవాలని వేడుకోలు



లింగంపేట్‌లో ధాన్యం కుప్ప చుట్టూ చేరిన వర్షపు నీరు



రెంజల్ మండలం కల్యాపూర్‌లో నేలమట్టం అయిన వరి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు రైతన్నకు తీవ్ర వేదనను మిగిల్చాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 41,711 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇటీవల కాలంలో ఇంత భారీ మొత్తంలో పంట నష్టం జరగడం ఇదే మొదటిసారి. ఒక్క కామారెడ్డి జిల్లాలోనే 31 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. ఇందులో 31,128 ఎకరాల్లో వరి పంటలకు నష్టం జరిగింది. చేతికొచ్చిన పంట నీట మునగడంతో రైతన్న కన్నీరుమున్నీరవు తున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందు నీటిపాలవడంతో దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ కుమిలిపోతున్నాడు. నిజామాబాద్ జిల్లాలో 8 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ధాన్యం గింజలన్నీ నేలరాలాయి. తడిసిన ధాన్యం కనీస మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తేనే రైతన్నకు కొంత ఊరట లభించనుంది. లేకపోతే పూర్తిగా అప్పుల ఊబిలో చిక్కుకునే ప్రమాదముంది.

కామారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లో మొత్తం 2 లక్షలా 10 వేల ఎకరాలు వరి పంట సాగయ్యింది. సాధారణంగా ఏప్రిల్ చివరి వారంలో పంటల కోతలు జోరందుకుంటాయి. అయితే ఈ యేడాది గత వారం రోజులుగా అకాల వర్షాలు ఉమ్మడి జిల్లాను ముంచెత్తుతున్నాయి. మంగళవారం కురిసిన భారీ వర్షాలు జిల్లాలో రైతాంగాన్ని తీవ్ర ఆగాధంలోకి నెట్టాయి. మొత్తం 31,242 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 21,608 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇందులో వరి 31,128 ఎకరాల్లో పంట నీటమునిగింది. ఇక మొక్కజొన్న 10 ఎకరాలు, టమాట 64 ఎకరాలు, మామిడి 40 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. కామారెడ్డి మండలంలో 15 వందల 60 ఎకరాల్లో వరి సాగయ్యింది. ఇందులో 13 వందల ఎకరాల్లో పూర్తిగా పంట నష్టం జరిగింది. కామారెడ్డితో పాటు లింగంపేట, బాన్సువాడలో పంట నష్టం ఎక్కువగా జరిగింది.

ఇక నిజామాబాద్ జిల్లాలో ఈ యేడాది మొత్తం 5 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 4 లక్షల ఎకరాల వరకు వరి పంట సాగయ్యింది. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాల వల్ల 10,469 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇందులో సుమారు 8 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. చేతికొచ్చిన పంట మొత్తం నీటిపాలయ్యింది. రెండు, మూడు రోజుల్లో పంటలు కోయాల్సి ఉండగా.. అకాల వర్షాలతో పంటంతా నీట మునిగింది. ధాన్యం గింజలు నేలరాలాయి. ఇక మామిడి రైతుకు కోలుకోలేని దెబ్బ పడింది. మొత్తం 85 గ్రామాల్లో 5,307 మంది రైతులకు చెందిన 8005 ఎకరాల్లో వరి పంట నేలరాలింది. 1602 ఎకరాల్లో నువ్వులు, 612 మొక్కజొన్న, 250 మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తంగా 160 గ్రామాల్లో 7276 మంది రైతులకు చెందిన 10,469 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇక మరో 5089 ఎకరాల్లోనూ పంట నష్టం జరిగింది. అయితే ఈ పంట నష్టం మొత్తం సాగైన పంటలో 33 శాతం కన్నా తక్కువ ఉండటంతో దీన్ని పంట నష్టంగా పరిగణించలేదు.

రైతులను ఆదుకుంటాం

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



అకాల వర్షాలతో నష్టపోయిన పంటల వివరాలు సేకరించాలని నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కలెక్టర్ లకు ఆదేశాలు ఇచ్చాము. ఇప్పటికే వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెప్పించుకుని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు తగిన సహాయం అందే విధంగా ప్రయత్నం చేస్తాము.

సొసైటీ సీఈవోను ఘెరావ్ చేసిన రైతులు

- గన్నీ బస్తాలు ఇవ్వట్లే.. కాంటా పెట్టడం లేదని ఆవేదన




సీఈవోను నిలదీస్తున్న రైతులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూరు మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి విట్టల్ ను బీర్కూరు గ్రామానికి చెందిన రైతులు ఘెరవ్ చేశారు. గత వారం రోజులుగా సొసైటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న గన్ని బస్తాలు ఇవ్వకపోగా, తమవైపు ధాన్యం కొనుగోలు కాంటా ఎందుకు తీసుకురావడం లేదని సీఈఓను ప్రశ్నించారు. సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యంతో తమ ధాన్యం నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కిలోన్నర తరుగు తీయడం వలన రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఎలాంటి తరుగు లేకుండా వడ్లను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మార్కెట్ గిడ్డంగుల వద్ద ధాన్యం ఎక్కువ ఉండడం చేత కాంట తీసుక రాలేకపోయామని వెంటనే ధాన్యం కొనుగోలు కాంటని ఏర్పాటు చేస్తామని సీఈవో విఠల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్



తడిచిన ధాన్యం పరిశీలిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లింగంపేట్ మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాల వద్ద తడిచిపోయిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. తడిచిన ధాన్యాన్ని సైతం ఎలాంటి షరతులు విధించకుండా కొనుగోలు చేయాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతుకు చేతికి వచ్చిన పంట పొలాల్లోని వరి వడగండ్ల వానకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. తూకం వేసిన ధాన్యంవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కోరారు. ఆయన వెంట నాయకులు భాస్కర్, సావిత్రి, రామ గౌడ్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

అకాల వర్షాలకు పంట నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులకు రెండు రోజుల్లో నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన అమలు చేసి ఉంటే రైతులకు అన్యాయం జరిగేది కాదని, రైతులకు చేతికందిన పంట నెల పాలయ్యిందనీ, పెట్టుబడి ఒక్క రూపాయి వచ్చే పరిస్థితి లేక రైతులు తీవ్ర బాధలో ఉన్నారన్నారు. సాధ్యమైనంత తొందరగా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రెడ్డి గారి రమేష్ రెడ్డి, బిజెపి నాయకులు, రైతులు ఉన్నారు.

ప్రతి గుంటను పరిశీలించాలి

- నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-లింగంపేట్/భిక్కనూర్/దోమకొండ

వర్షాలతో నష్టం వాటిల్లిన ప్రతి గుంటను పరిశీలించాలని, నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం లింగంపేట మండలంలోని లింగంపల్లి, కొయ్య గుండుతండాలో నష్టపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులు వాస్తవాలను అధికారులకు వివరించాలన్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్, ఏడిఏ రత్నం, మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, ప్రజా ప్రతినిధులు రైతులు ఉన్నారు.

కౌలు రైతులకు కూడా నష్టపరిహారం చెల్లిస్తాం : కలెక్టర్

భిక్కనూర్ : శుక్రవారం కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్య పడవద్దని, వ్యవసాయ శాఖ సిబ్బంది పంట నష్టం అంచనా వేసి నివేదిక సమర్పించిన తర్వాత ప్రతి రైతుకు నష్టం జరగకుండా నష్టపరిహారం చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. బుధవారం మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో శుక్రవారం కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్ రెడ్డి, సర్పంచ్ నర్సింలు యాదవ్, డిసిసిబి డైరెక్టర్ సిద్ధి రాములు, ఏడిఏ అపర్ణ, ఎమ్మార్వో ప్రేమ్ కుమార్, ఎంపీఓ ప్రవీణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి రాధా, రైతుబంధు గ్రామ కన్వీనర్ పుల్లూరి శివలింగం, ఏ ఈ ఓలు గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన పడొద్దు

దోమకొండ : అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. దోమకొండ మండల కేంద్రం లోని ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు, రైతుల వరి పంట లను బుధవారం పరిశీలించారు. గ్రామాలలో వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలు అంచనా వేస్తారని, పంట నష్టం అయినా రైతులు ఏఈవో లకు పూర్తి వివరాలు అందించాలన్నారు. అకాల వర్షం తో పంట నష్టం పోయిన రైతులకు పంట నష్టం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, సర్పంచ్ అంజలి, ఏవో పవన్, ఆర్ఐ మహేందర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు చెల్లించాలి

- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి



మహిళా రైతుతో పంట నష్టంపై మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి/రాజంపేట్

అకాల వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా నరసన్నపల్లిలో, రాజంపేట్ మండలం పొందుర్తిలో నష్టపోయిన పంటలను బుధవారం పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట బీమా చేయకపోవడం చాలా దురదృష్టకరమని, ఏ రైతు కూడా ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. రైతుల పక్షాన పోరాటం చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుందని, అదేవిధంగా జిల్లాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రాంతాలలో తిరుగుతూ పంట నష్టపోయిన ప్రతి రైతును కలిసి నివేదిక ఇవ్వాలని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి 20000 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వివరాలు మెయిన్‌లో..

మద్దికుంట ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-రామారెడ్డి



విరాళం అందజేస్తున్న మాచారెడ్డి ఎంపీపీ

మండలం లోని మద్దికుంటలో వెలిసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ పున్న నిర్మాణానికి బుధవారం మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు రూ.11 లక్షల 11 వేల 112 ను ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్తులు, నరసింగరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో నర్సింగరావు సహకారాలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోజరి లచ్చిరెడ్డి, సర్పంచ్ రామ్ రెడ్డి, ఉప సర్పంచ్ నరేందర్, ఆలయ కమిటీ ప్రధాన పూజారి ప్రభాకర్ స్వామి, కంది ప్రభాకర్ రెడ్డి, ఆంజనేయులు, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-రామారెడ్డి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం సిఆర్‌పి పై రామారెడ్డి పి హెచ్సి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వలువురు వైద్యులు మాట్లాడుతూ.. ఎవరికైనా అనుకోకుండా గుండెపోటు వస్తే, సిఆర్‌పి చేసి రోగిని రక్షించవచ్చని, ప్రభుత్వ ఉద్యోగులకు సిఆర్పిపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంపీపీ దశరథ్ రెడ్డి మాట్లాడుతూ... అనుకోకుండా గుండెపోటు సోకిన వ్యక్తిని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం, గ్రామాల్లో కూడా అవగాహన కల్పిస్తూ, ప్రాణాలను కాపాడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతి ఒక్కరు సిఆర్పి పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్ స్థానిక సర్పంచ్ దండ బోయిన సంజీవ్, ఎంపీ ఓ సవిత రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి.. రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేపట్టిన రైతులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రం లోని లింగాయపల్లి, పాత రాజంపేట, కామారెడ్డి మండ లంలోని నరసనాపల్లి కొట్టాల పల్లి గ్రామాలలో సోమవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో పంటలు పూర్తిగా నష్టపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. లింగయ్యపల్లి, పాత రాజంపేట్ రైతులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. అకాల వర్షాల వల్ల సుమారుగా ఈ నాలుగు గ్రామాలలో 2000 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని, ఎంతో శ్రమకోర్చి సాగు చేస్తున్నా.. తమకు నష్టాలే వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ముందుకు వచ్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ప్రతిష్టించాలి

నవతెలంగాణ-సదాశివనగర్



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అనేక రైతాంగ ఉద్యమాలు చేసినటువంటి చాకలి ఐలమ్మను ఈ రాష్ట్ర ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత పూర్తిగా మర్చి పోయిందని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి అన్నారు. సదాశివనగర్ మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉద్యమ సమయంలో చాకలి ఐలమ్మను తెలంగాణ వీరనారిగా కొనియాడిన కేసీఆర్ నేడు స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టకపోవడంలో అంతర్యం ఏమిటో తెలంగాణ ప్రజలకు వివరించాలని అన్నారు. అదేవిధంగా ఆమె జన్మించినటువంటి జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మచ్చర్ల శ్రీకాంత్, రాజు, ముత్యం, రవి నరసయ్య, సంతోష్ భాస్కర్ గంగాధర్ శంకర్, బాలయ్య, రాజశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ధీర్ఘకాలిక రుణాల చెల్లింపులకు వన్‌టైం సెటిల్‌మెంట్ : డీసీసీబీ చైర్మన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ధీర్ఘకాలిక రుణాల చెల్లింపులకు వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) స్కీమ్ అమలు చేస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎన్‌డీసీసీబీలో బుధవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ సొసైటీ చైర్మన్లు, బ్యాంకు లో లోన్లు తీసుకున్న రైతుల అభ్యర్థన మేరకు ఓటిఎస్ (ఏక కాల పరిష్కారం) స్కీమ్ ను మే 1 నుండి జూన్ 30 వరకు అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రైతులు ఓటిఎస్ స్కీమ్ ను సద్వినియోగం చేసుకోని బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని, ఈ స్కీం జూన్ 30 వరకు అమలులో ఉంటుందన్న విషయం రైతులు గమనించి సహకరించాలని అన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-తాడ్వాయి

పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం ...తాడ్వాయికి చెందిన పని బాలయ్య (30) అనే వ్యక్తి వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న సమ యంలో ప్రమాదవశాత్తు కాలుజారి ముందుకు పడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కామారెడ్డి లోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు ప్రదీప్, కుమార్తె రక్షితలు ఉన్నారు. ఈ విషయమై భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బుధవరం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రామాలయం టెంపుల్ పరిధిలో నివాసం ఉంటున్న చెన్నం గారి లింగం (26) మద్యానికి బానిసై వ్యక్తి కుటుంబ సభ్యులతో గొడవపడి సోమవారం ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. మంగళవారం ఇంటి ప్రాంతంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేశారు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై గణేష్ తెలిపారు.

రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు ఇవ్వాలి

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డులు కలిగిన వారందరికీ 12 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా ఇవ్వాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీ వో డబ్ల్యూ) బోధన్ పట్టణ అధ్యక్షురాలు బి. నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ముందు ప్రగతిశీల మహిళా సంఘం (పీ వో డబ్ల్యూ)బోధన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటికి వెళ్లి సర్వే చేసి, సంతకాల సేకరణ నిర్వహించామని తెలిపారు. ప్రతి వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు కిలోలు, కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు సన్న బియ్యం, 12 రకాల నిత్యావసర సరుకులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బిపాషా బేగం, రెహానా బేగం, ఏ లక్ష్మి, బి. సుచరణ, ఎం లక్ష్మి, ఎస్. కళావతి, దేవ్ బాయ్,సి.హెచ్ లక్ష్మీబాయి, తస్లీమ్ బేగం, షేక్ కొజియా, అజీమా బేగం తదితరులు పాల్గొన్నారు.

అదనపు జిల్లా జడ్జిని కలిసిన డిఫెన్స్ కౌన్సిల్స్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ మొదటి అదనపు జిల్లాజడ్జిగా బాధ్యతలు స్వీకరించిన కనకదుర్గను డిఫెన్స్ కౌన్సిల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, ఇతర డిఫెన్స్ కౌన్సిల్ ఉదయ కృష్ణ, శుభం, ప్రమోద్, న్యాయవాదులు జగన్ మోహన్ గౌడ్,పిల్లి శ్రీకాంత్, గోవర్ధన్ తదితరులు ఆమెను కలిశారు. ఆమె గద్వాల నుండి బదిలీపై వచ్చిన విషయం విదితమే.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

- పలు గ్రామాల్లో నేలకొరిగిన వరి
- తడిసిన వరి ధాన్యం
- నేల రాలిన మామిడి

అకాల వర్షాలు రైతులకు అపార నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఆరుగాలం శ్రమకోర్చి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసి రైతుకు గుండె కోతను మిగులుస్తున్నాయి. కోతకొచ్చిన పంటలు ఈదురుగాలులకు నేల వాలుతున్నాయి. పంట బాగా పండింది... ఖర్చులు పోను చేతికి కొన్ని డబ్బులు వస్తాయనుకుంటున్న సమయంలో అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేస్తుంది.



జక్రాన్‌పల్లి : పంటలు పరిశీలిస్తున్న ఏవో, ఏఈవోలు

నవతెలంగాణ-విలేకరులు

కమ్మర్‌పల్లి: ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో వరి, సజ్జ పంటలు నేల వాలాయి. కళ్ళల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. కోతకు వచ్చిన దశలో ఈదురుగాలులతో మామిడికాయ రాలిపోయింది. మండలంలోని నాగపూర్ గ్రామంలో 10 ఎకరాల్లో మామిడి తోటకు నష్టం జరిగింది. వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్, ఉద్యాన శాఖ అధికారి సుమన్ నేలరాలిన మామిడి తోటను సందర్శించి పరిశీలించారు. చౌట్‌పల్లి, బషీరాబాద్ గ్రామాల్లో వరి పొలాలు నేలకొరగగా బుధవారం ఏఈఓ పద్మ సందర్శించి పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి నివేదిక పైఅధికారులకు పంపిస్తామని రైతులకు తెలిపారు. రైతులు మాత్రం ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటు న్నారు.

కౌలురైతుకు కోలుకోలేని దెబ్బ

అకాల వర్షాలతో కౌలు రైతుకు కూడా కష్టమొచ్చింది. చేతికందే పంట ఈదురుగాలతో కూడిన వర్షానికి నేలరాలి కౌలు రైతు నెత్తిన కోలుకోలేని దెబ్బ పడింది. మండలంలోని హాస కొత్తూర్ గ్రామానికి చెందిన ఏనుగు రాకేష్ ఎకరం పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేశాడు. పంట బాగా పండి చేతికి వస్తుందన్న దశలో వరుణుడి కోపంతో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు పడడంతో వరి పొలం నేలవాలి, వరి ధాన్యం గింజలు భూమి పాలయ్యాయి. చేతికందే పంట నేలపాలై, సాగు ఖర్చులు కూడా చేతికందే పరిస్థితి లేకుండా పోయింది. దీంతోకౌలు డబ్బులు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో రాజేష్ పడిపోయాడు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి కౌలు రైతును కష్టాల నుండి గట్టెక్కించాలని కోరుతున్నాడు.

మాక్లూర్: మండలంలోని మామిడిపల్లి, మాక్లూర్, గుత్ప గ్రామాల్లో మంగళవారం కురిసిన వడగండ్ల వర్షం వల్ల నష్టపోయిన పంట పొలాలను మండల వ్యవసాయ శాఖ అధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. మామిడిపల్లిలో 350 ఎకరాలు, మాక్లూర్, కష్టానగర్ గ్రామంలో 150 ఎకరాలు, గుత్పలో 100 ఎకరాలు వరి పంట నష్టపోయినట్లు మండల వ్యవసాయ అధికారి పద్మ, ఏడీఏ విజయ లక్ష్మి తహశీల్దార్ శంకర్, సర్పంచ్ మల్లారెడ్డి పరిశీలించారు. వీరితోపాటు ఉప సర్పంచ్ రైతులు పాల్గొన్నారు. నష్టపోయిన వరి పొలాలను, ధాన్యాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు... మండల కేంద్రంలో వడగళ్ల వానకు నష్టపోయిన వరి పొలాలను, ధాన్యాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు అధ్వర్యంలో పరిశీలించారు. నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని పలుగ్రామాల్లో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ బుధవారం రైతులు, ఏఈఓలతో కలిసి నష్టపోయిన పంటలను పరిశీలించారు. మంగళవారం భారీగా కురిసిన వర్షం, ఈదురుగాలుల వల్ల సుమారుగా 600 ఎకరాల్లో రైతులు వేసిన వరి, నువ్వులు, సజ్జ పంటలు నేలకొరిగాయని అన్నారు. నష్టపోయిన పంటల వివరాలను ప్రాథమిక అంచనావేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు ఆయన తెలిపారు. కోసిన వరి ధాన్యాన్ని వానలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ లు సాయి సచిన్,స్నేహ,రైతు బంధు సమితి మండలాధ్యక్షులు సున్నపు అంజయ్య, మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచ్లు, ఎంపీటీసీలు, రైతుబంధు అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: అధికారులు మండలంలోని వరి పంట నష్టాన్ని అంచనా వేస్తూ సర్వే నిర్వహించారు. మండలంలోని చింతలూరు, కలిగోట్, పడకల్, ముని పల్లి, సికింద్రా పూర్, పుప్పాలపల్లి, కేశ్‌పల్లి, లక్ష్మాపూర్, నారాయణపేట, బ్రాహ్మణపల్లి, జక్రాన్‌పల్లి తదితర గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి దేవిక ఆధ్వర్యంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు క్లస్టర్ వారిగా వరి పంట నష్టాన్ని అంచనా వేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం తహసిల్దార్ దత్తాద్రి తో కలిసి మండలం వ్యవసాయం అధికారి హరికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి కుప్పలను రైతులు తాటి పత్రాలతో కప్పించుకోవాలని సూచించారు. నువ్వు పంట నేలకు ఒరిగిందని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. వచ్చే మూడు రోజుల్లో వర్షాలు ఉన్నందున రైతులు వరి ధాన్యాన్ని కప్పి ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేగాం ఉపసర్పంచ్ గంగారెడ్డి, ఎంపీటీసీ అనూష శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు ప్రమోద్, ఆరే రాజేశ్వర్, ఏఈఓ వసుంధర రైతులు పాల్గొన్నారు.

వేల్పూర్ మండలంలోని వర్షాలకు దెబ్బతిన్న పంటలు, కోసి ఆరబెట్టిన ధాన్యం పరిశీలించారు. మండలంలో వరి పంట, నువ్వు పంట దెబ్బతిన్న పొలాలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిసామని వ్యవసాయ అధికారి నర్సయ్య తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

బోధన్: బోధన్ డివిజన్‌లో వడగళ్ల వర్షాలకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, తడిసిన ధాన్యం కుప్పలను జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. వడగళ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఎలా రక్షించుకోవాలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు ఆయన సూచనలు చేశారు. అలాగే దెబ్బ తిన్న పంటలను గ్రామాల వారీగా సర్వేచేసి పంపించాలని ఏఈఓలను ఆదేశించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి సంతోష్ , సొసైటీ సీఈఓ బస్వంత్ రావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సాయి చరణ్, అనుజ, అపర్ణ మరియు రైతులు ఉన్నారు.



కమ్మర్‌పల్లిలో..



మాక్లూర్‌లో..



బోధన్‌లో పంటను పరిశీలిస్తున్న అధికారులుస్తున్న

పోచంపాడ్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ-మెండోర

మండలంలోని పోచంపాడ్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో బుధవారం విద్యార్థిని విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే, పిల్లల తల్లిదండ్రులకు మోటివేషన్ క్లాస్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. మోటివేటర్ అడ్డిగ శ్రీనివాస్ తల్లిదండ్రులకు వారి పిల్లల ఎదుగుదలకు తోడ్పడే మంచి నైపుణ్యాలతో కూడుకున్నటువంటి విషయాలను తెలిపారు. యాంత్రిక జీవితంలో పిల్లలపై తల్లిదండ్రుల శ్రద్ధ తగ్గుతుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుకై వారితో సమయాన్ని గడపాలని, ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. అనంతరం పాఠశాల కరెస్పాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రైమరీ స్థాయి నుండి హై స్కూల్ మరియు డిగ్రీ స్థాయి వరకు విద్యార్థులు కష్టపడి చదవాలని అప్పుడే దానికి సంబంధించిన పట్టా పొందుతారని అన్నారు. చిన్నతనం నుండి ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అందుకు ఉదాహరణ ఈ చిన్నారులే అని అన్నారు. గ్రాడ్యుయేషన్ పట్టాలను ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శివరాం ప్రసాద్, మిసిని హై స్కూల్ కరెస్పాండెంట్ బాలి రవీందర్, లింబగిరి స్వామి, పాఠశాల ఉపాధ్యాయ బందం, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల



దోంచంద గ్రామం నుండి తడపాకల్ వరకు 3 కోట్ల 92 లక్షల వ్యయంతో ఇటీవలే మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయగా బుధవారం బీటీ రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు మాట్లాడుతూ... ఈ రోడ్డు నిర్మాణం వల్ల రెండు గ్రామాలకు మరింతగా ప్రయాణం సులభతరమయ్యిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా పీఏసీఎస్ అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ గద్దె రాధ గంగారాం, ఉపసర్పంచ్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విడిసీ సభ్యులు నాగిరెడ్డి రాజేందర్, కురుమ రాజేంధర్, పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి, వేముల పెద్ద రాజగౌడ్, నర్సయ్య, సుద్దాల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ పరిధిలో ఉక్లనాయక్ తండాకు వెళ్లే దారిలో కొండమూల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. కొండమూల వాగుపై రవాణా సౌకర్యం కోసం బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి ప్రశాంత్ రెడ్డి ఇటీవల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణానికి తండా వాసుల సమక్షంలో సర్పంచ్ పెండ ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యురాలు బుస్సాపురం సుప్రియ నవీన్ యాదవ్ బుధవారం భూమి పూజ చేశారు. వర్షం పడితే రాకపోకలు రద్దు అయ్యేవని, తండా ప్రజలకు ఎంతో ఇబ్బంది ఉండేదన్నారు. ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు అంతరాయంగా ఉన్న ఈ దారిలో బ్రిడ్జి నిర్మాణం చేయిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ఎల్లావేళల రుణపడి ఉంటామని తండా వాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బుస్సాపురం నవీన్ యాదవ్, స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తండా వాసులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందొద్దు : ఎమ్మెల్యే షకీల్ ఆమేర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

నవతెలంగాణ- బోధన్

అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయి ఇబ్బంది పడుతున్న రైతులు ఆందోళన చెందవద్దని తడిసిన ధాన్యాన్ని తామే కొనుగోలు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ రైతులకు భరోసా కల్పించారు. బుధవారం ఎడపల్లి మండలంలోని సరయు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పార్టీ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షానికి పంటలు తడిసిపోయాయని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. తడిసిన ధాన్యమైన సరే ప్రతి గింజ కొనుగోలు చేస్తామని అన్నారు. సొసైటీ చైర్మన్లు ధాన్యం కొనుగోలు కోసం తనను సంప్రదించాలని అన్నారు. త్వరలో ప్రతి మండలంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. తొమ్మిది సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి పనులు చేశామని అన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఏ రాష్ట్రంలోనూ జరగడంలేదని అన్నారు. మహారాష్ట్రలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన మహాసభలు విజయవంతమయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్రలో సభలు నిర్వహించాలని తనను ఆదేశించగానే ఒక కార్యకర్తగా వెళ్లి సభలు నిర్వహించానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి మండలంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అంతకుముందు అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విటల్, జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎంపీపీ బుద్దె సావిత్రి, నవీపేట్ ఎంపీపీ శ్రీనివాస్, ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వీఆర్ దేశాయి, వైస్ చైర్మన్ సాలూర షకీల్, డిసిసిబి డైరెక్టర్లు శరత్ , గంగారెడ్డి, బోధన్ జడ్పిటిసి లక్ష్మి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్ , సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షులు ఏటిఎస్ శ్రీనివాస్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

నవతెలంగాణ-బోధన్

అకాల వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో బుధవారం బోధన్ నియోజకవర్గ బిజెపి నాయకులు మోహన్ రెడ్డి అమ్దాపూర్, ఎరాజ్‌పల్లి, ఊట్ పల్లి గ్రామాలలో ధాన్యాన్ని పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరానికి పదివేల రూపాయలు ఇస్తామన్న కేసీఆర్ హామీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం తడిసి మొలకలు వచ్చేలా అయిందని అన్నారు. ధాన్యం తడిసిన అధికారులు పర్యటించలేదని, కనీసం సర్వే చేయలేదని అన్నారు. ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని నష్టపరిహారం ప్రతిపాదించలేదని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలలో రైతుల వివరాలు సేకరించి న్యాయం చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు సుధాకర్ చారి, శ్రీధర్, పోశెట్టి, వాసు, ప్రవీణ్, నరసింహులు తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం

- ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- వర్షాలకు దెబ్బతిన్న పంటలు పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

వరి కోత పంట చేతికచ్చే సమయానికి ఇలా జరగడం చాలా బాధాకరమని, రైతులు అధైర్య చెందవద్దని, ధైర్యంగా ఉండాలని, మీరు ఎంతో కష్టపడి పండించిన పంట ప్రకృతి వైపరీత్యంవల్ల ఇలా జరగడం బాధాకరమని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో ఫోన్లో మాట్లాడి వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహాయ పునరావాస చర్యలలో భాగంగా ఎకరానికి 10 వేలు అందిస్తుందని సీఎం ప్రకటించారన్నారు. గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశం ఉందని, నష్టపరిహారం విషయమై కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. డిచ్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి తోపాటు ఇతర మండలాల్లో వర్షానికి వరి, నువ్వుల పంటలు, మిర్చి తోటలు, టమాట పంట, మామిడితోటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లతో మాట్లాడి ప్రతీ గింజ కొనేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు, చింత శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్, గజవాడ జైపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో టీవీఎస్ గోపి బాబు, రాంబాబు, సీనియర్ నాయకులు శక్కరి కొండ కృష్ణ, అమీర్ ఖాన్, మోహమ్మద్ యూసుఫ్, సర్పంచులు, ఉపసర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ, అనుబంధ సంఘ నాయకులు, రైతులుపాల్గొన్నారు.

కార్మిక హక్కులపై దాడిని మే డే స్ఫూర్తితో తిప్పికొట్టాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వి రమ

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమ

కార్మికుల హక్కులపై దాడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను మే డే స్ఫూర్తితో తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ వి రమ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశంలోని ఉన్నటువంటి కార్మిక వర్గంపై రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దాడి తీవ్రతరం చేసిందని అన్నారు. దేశంలో కొంతమంది పెట్టుబడుదారుల స్వలాభం కోసం దేశ సంపదను, కార్మిక వర్గ శ్రమను దోచిపెడుతుందని ఈ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయకుండా కులం మతం ప్రాంతం జాతీయత పేరుమీద కార్మిక వర్గం ఐక్యం కాకుండా విచ్చిన్నం చేసే ప్రయత్నం చేస్తుందని అందులో దుయ్యబట్టారు. అందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడలుగా మార్చి కార్మిక వర్గ హక్కులను కాలరాసి కట్టు బానిసలు చేసి పెట్టుబడుదారి వర్గానికి దోచుకునే విధంగా సులభదానం చేసిందని చీకాగో నగర మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను 12 గంటలకు పెంచిందని సమ్మె చేసే హక్కు లేకుండా చేసిందని కనీస వేతనాలు ఉద్యోగ భద్రత ఇవేవీ లేకుండా చేసిందని అన్నారు. రాజ్యాంగ సంస్థలను ,వ్యవస్థలను ధ్వంసం చేస్తుందని ఇది ఈ దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ప్రజాస్వామ్యాన్ని భావ ప్రకటన స్వేచ్ఛను కూని చేస్తుందని అన్నారు. రాబోయే భవిష్యత్తులో మే డే స్ఫూర్తితో కార్మిక హక్కుల పరిరక్షణతో పాటు రాజ్యాంగాన్ని దేశాన్ని కాపాడుకోవడానికి కార్మిక వర్గం పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్, చక్రపాణి నన్నేసాబ్, మోహన్, కటారి రాములు, లక్ష్మీ, నీలావతి, గణేష్, విజయ్, సూర రవి, భూపతి, చందు తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై వీవోఏల నిరసన



కమ్మర్‌పల్లి : ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న వీవోఏలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ముప్కాల్/డిచ్‌పల్లి

డిమాండ్ల సాధనకోసం సమ్మె చేస్తున్న ఐకెపి వీవోఏలు తమ నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయవద్ద వీవోఏలు ఒంటి కాలిపై నిలబడి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ తమకు కనీస గౌరవ వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల ఐకేపీ వీఓఏల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్: గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ (వీవోఏ)లు తమ డిమాండ్ల సాధనకు బుధవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనం ముందు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. బాల్కొండ ఉమ్మడి మండల వ్యాప్తంగా ముప్కాల్ మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గురువారం నుంచి బాల్కొండ ఉమ్మడి మండల వ్యాప్తంగా సమ్మెకు దిగనున్నట్లు వీవోఏల జిల్లా అధ్యక్షురాలు అరుణ తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్, బాల్కొండ, మెండోరా వీవోఏల సంఘాల అధ్యక్షురాలు అరుణ, మంజులత, కళావతి పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఇందల్ వాయి మండల కేంద్రంలోని ఐకేపీ వివోఏ ఒంటికాలుమీద నిలబడి నిరసనలు తెలిపారు. కనీస వేతనం 18 వేలు చెల్లించాలి. అర్హత కలిగిని వివోఎ లను సీసీ లుగా ప్రదోన్నతులు కల్పించాలి.ఉద్యోగ భద్రత కల్పించి, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సరళ,ఉపాధ్యక్షురాలు సువర్ణ,ప్రధానకార్యదర్శి రాము, సహకార్యదర్శి మమతా,రాధిక, మౌనిక, విజయం,భాగ్య కవిత, సౌమ్య,అజిత, మమత,మంజుల తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి రెండు గేదెలు మృత్యువాత


మృత్యువాత పడ్డ గేదెలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని కాయితితండా గ్రామపంచాయతీలో మంగళవారం అర్ధరాత్రి పిడుగు పడి తండాకు చెందిన మంజ జ్యోతి రాజ్‌కు చెందిన రెండు గేదెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. రోజు వారిలాగే గేదెలను సాయంత్రం చెట్టుకింద కట్టేశాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో భారీవర్షం కురవడంతోపాటు పిడుగులు పడడంతో రెండు గేదెల మృతి చెందినట్లు రైతు మంజ జ్యోతిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సమ్మె ప్రారంభించిన వీవోఏలు


నినాదాలు చేస్తున్న వీవోఏలు

నవతెలంగాణ-పిట్లం

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐకెపి వి ఏ ఓ ల మండల అధ్యక్షుడు సాయి సుధీర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ముందుగా ఆర్ అండ్ బి రోడ్డుపై సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ, ఇన్సూరెన్స్ అమలు పరచాలని, గ్రేడింగ్ విధానము లేకుండా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏవోలు స్వప్న, అంజలి, రిజ్వాన, జయశ్రీ, గంగారాం, గంగారాణి, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


పంట నష్టం పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న స్పీకర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్/గాంధారి

వడగళ్ల వానతో నష్టపోయిన పంట పొలాలను రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. బుధవారం బాన్సువాడ మండలంలోని తడ్కోల్ గ్రామ శివారులో నష్టపోయిన పంటలను ఆయన స్వయంగా పరిశీలించారు. స్పీకర్ ముందు రైతులు కన్నీరు పెట్టారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ అకాల వర్షాలతో నోటికి వచ్చిన బుక్క జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంత సహాయం చేసిన రైతుకు తక్కువే అని అన్నారు. రైతులు అధైర్య పడొద్దని తెలిపారు. భవిష్యత్తులో ఓ నెల ముందే వరి నాట్లు వేసుకుంటే ఈ విపత్తు నుంచి తప్పించుకోవచ్చని స్పీకర్ అన్నారు.

వడగండ్ల వానతో నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని ఈ విషయం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుక వెళ్తానన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. యుద్ధప్రాతిపదికన నష్టపోయిన ధాన్యం పంటల వివరాలు సేకరించాలని జిల్లా అధికార యంత్రాంగానికి స్పికర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్వయంగా పోచారం పంట పొలాల్లోకి వెళ్లి నష్ట పోయిన రైతులకు ధైర్యం చెప్పారు. అకాల వర్షాలకు నీటమునిగిన పంటలను పరిశీలించారు. రైతుల బాధలు కనుగొన్నారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు అధైర్య పడొద్దని సూచించారు. వీరి వెంట జిల్లా రైతు సమన్వయ చైర్మన్ అంజిరెడ్డి, జడ్పిటిసి పద్మ గోపాల్ రెడ్డి, తదితరులున్నారు.

గాంధారి : మండలంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిశ్రీ సీతాయిపల్లి, గండివెట్, గండివేట్ తండాలో రైతు పొలాలను ఎమ్మెల్యే జాజాల సురేందర్ స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన రైతులు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ముద్దెల్లి సొసైటీ చెర్మెన్ సజ్జనపల్లి సాయిరాం, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, చెన్నపూర్ సర్పంచ్ గీత శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

వలస కార్మికులతో జీపీ పనులు


పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలో పక్కరాష్ట్రం నుండి వలస కార్మికులతో మురుగు కాలువల పరిశుభ్రం చేయిస్తున్నట్టు గ్రామ సర్పంచ్ కపిల్ పటేల్ తెలిపారు. పంచాయతీకి నిధులు రాక పోవడంతో గ్రామంలోని జీపీ వర్కర్‌లు కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. వారు కుటుంబ పోషణకు ఇతర పనులకు వెళ్తున్నట్టు తెలిపారు. దీంతో పనులు పెండింగ్ పడ్తున్నాయని, మురికి కాలువల్లో చెత్తాచెదారం తొలగించేందుకు వసల కార్మికులను పిలిపించుకొని పనులు చేయిస్తున్నట్టుతెలిపారు.

రికార్డులను అప్‌డేట్‌గా పొందుపర్చాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-పిట్లం

పంచాయతీ రికార్డులను అప్డేట్‌గా పొందుపరచుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని కారేగావ్ గ్రామపంచాయతీని సందర్శించి పలు రికార్డులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయితీలు జమ కర్చు , ఇంటి పన్ను , కిరాణా సముదాయ రికార్డులు, పల్లె ప్రగతి , హరితహారం , ఉపాధి హామీ పనుల రిజిస్టర్ లన్నింటిని అప్డేట్‌గా పూర్తిచేసి పొందుపరచు కోవాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామ నర్సరీని పరిశీలించి మొక్కల ఎదుగుదలకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ జాకీర్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డుదారుల గుండా అక్రమ రవాణా

- ఆర్టీవో శాఖ ఆదాయానికి గండి


వేరే మార్గంలో వెళ్తున్న లారీ

నవతెలంగాణ-మద్నూర్

మహారాష్ట్రకు పూర్తిగా సరిహద్దుల గల మద్నూర్ మండలం సలాబత్పూర్ సమీపంలో గల అంతర్రాష్ట్ర ఆర్టీవో శాఖ చెక్‌పోస్టుకు అడ్డుదారుల గుండా వెళ్లే అక్రమ రవాణా మూలంగా ఆదాయానికి భారీగా గండి పడుతుందని మండల ప్రజల్లో అభిప్రాయం వ్యక్తం అవుతుంది. రాష్ట్రానికి ఆర్టీవో శాఖ ద్వారా రావలసిన ఆదాయానికి గండిపడడానికి కారణం రాష్ట్ర సరిహద్దులోని మహారాష్ట్రలో గల దెగ్లూర్ పట్టణానికి గల ఆర్టీవో శాఖ ప్రతి వాహనాలకు వే బ్రిడ్జ్ ద్వారా తూకం వేస్తూ అనుమతులకు మించి ఓవర్ లోడుగా వెళ్లే వాహనాలపై భారీగా జరిమానాలు విధిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అంతర్రాష్ట్ర వాహనాలు మన రాష్ట్ర అంతర్రాష్ట్ర ఆర్టీవో చెక్‌పోస్ట్ గుండా వెళ్లకుండా అడ్డుదారులైన మహారాష్ట్రలోని భక్తాపూర్ నాగ్రాల మీదుగా పెద్ద తడుగూర్ రోడ్డు గుండా మద్నూర్ మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారి ఎన్ ఎన్ ఏ 161 రహదారికి చేరుకొని హైదరాబాదు వైపు వెళ్లడం ఇటు తెలంగాణ నుండి మహారాష్ట్రకు కూడా ఈ రహదారి ఉండని అడ్డుదారుల నుండి వాహనాలు తరలిస్తూ తెలంగాణ అంతర్రాష్ట్ర ఆర్టీవో శాఖకు ఆదాయం రాకుండా గండి కొడుతున్నారు. మహారాష్ట్ర ఆర్టీవో చెక్‌పోస్ట్ అధికారులు వే బ్రిడ్జ్ తూకం ఏర్పాటుచేసి ప్రతి వాహనానికి తూకం వేయడంతో ఓవర్ లోడ్‌తో వెళ్లే వాటికి జరిమానా విధిస్తున్నారు. దీంతో అధికారులకు చిక్కకుండా ఓవర్‌లోడ్‌తో అడ్డదారుల గుండా దారి మళ్లిస్తూ ఆదాయం చెల్లించకుండా వాహనాలు తరలివెళ్తున్నాయి. అడ్డదారులను గుర్తించి అక్కడ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డబుల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేసిన సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని మదన్‌హిప్పర్గ గ్రామానికి మంజూరైన ఐదు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం బుధవారం ఆ గ్రామ సర్పంచ్ రాజు పటేల్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తున్నారని ప్రస్తుతం ఐదు ఇండ్లు మంజూరైయ్యాయని, వాటికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించినట్టు తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగబాయి, మాజీ సర్పంచ్ విట్టల్ రావు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు హన్మంత్ పటేల్, పార్టీ సీనియర్ నాయకులు సెట్కార్ హన్మంత్ రావు, ఇతరులు జితేందర్ పటేల్ ,వెంకటేష్ పటేల్, లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


నందకుమార్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలం అంతాపూర్ గ్రామానికి చెందిన నందకుమార్ (35) గత నెల 31వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదని వారి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్ఐ బుధవారం తెలిపారు. ఆయనకు మానసిక స్థితి సరిగా ఉండదని, ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు నాచురంగు చెక్ షర్ట్, బూడిద రంగు పాయింట్ వేసుకున్నట్టు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతులకు కోలుకోని దెబ్బ

- లింగంపేట్‌లో అధికనష్టం
- సుమారు 4440 ఎకరాల్లో వరి
- పంటకు నష్టం


లింగంపేట్‌లో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్/సదాశి వనగర్/రామారెడ్డి/గాంధారి

ఈదురుగాలులు, వడగండ్ల వానలు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు బీభత్సం సృష్టించాయి. దీంతో రైతులకు కోలుకోని దెబ్బ తగిలింది. ఈదురుగాళ్లు వడగండ్ల వాన అన్నదాతను ఆగం చేసింది. లింగంపేట్ మండలంలో 4440 ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో వెళ్లి అంచనా వేశారు. 3562 మంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తున్నట్టు తెలిపారు.

ప్రధానంగా మండలంలో ఐలాపూర్ గ్రామంలో 1150 ఎకరాలకు నష్టం వాటిల్లిగా, బోనాల్ 400 ఎకరాలు, నాగారం 300 ఎకరాలు, మేంగారం 180 ఎకరాలు తదితర గ్రామాల వారీగా నివేదికలు రూపొందించినట్టు ఎల్లారెడ్డి ఏడిఏ రత్నం తెలిపారు. ఆమె వెంట వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, విస్తీర్ణ అధికారులు ప్రశాంత్, సంతోష్, దివ్య, రమ్య మధుసూదన్ తదితరులు ఉన్నారు.

పంటలు పరిశీలన

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పంటలను మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి పరిశీలించారు. ధర్మారావుపేటలో రెడ్డి గారి రవి పొలాన్ని పరిశీలించారు. యాచారం,వజ్జపల్లి గ్రామాలతో విస్తరణ అధికారులు తమ క్లస్టర్‌లలో దెబ్బతిన్న పంటలను పరిశీలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ధన్వల్, రైతులు భాస్కర్‌రెడ్డి, సంజీవ్, సాయిలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: గాంధారి మండలంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షాలకు నష్టం వాటిల్లిన పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. 991 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, 641 మంది రైతులు నష్టపోయినట్టు మండల వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. మండలంలోని గండిపేట్ సీతాయపల్లి, మేడిపల్లి, గౌరారం, ముదల్లి వెంకటాపూర్, సర్వాపూర్, నర్సాపూర్, గ్రామాల్లో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్టు అలాగే పోతంగల్ బ్రాహ్మణపల్లి గుర్జాల్ పెట్ సంఘం మాత సంఘం గ్రామాల్లో పాక్షికంగా పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పంటలను ఎంపీపీ రాధా బలరాం, తహసీల్దార్ గోవర్ధన్ తదితరులు పరిశీలించారు.

రామారెడ్డి : అకాల వర్షానికి, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్ద అవడంతో బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీపీ దశరథ్ రెడ్డి పరిశీలించారు. నష్టం వివరాలను విప్ గంపగోవర్ధన్, స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ దృష్టికి తీసుకెళ్తామని, న్యాయం జరిగేలా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, సొసైటీ డైరెక్టర్ లక్ష్మాగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధిరాములు, సొసైటీ సిబ్బంది నవీన్, రైతులు తదితరులు ఉన్నారు.


గాంధారి నష్టం వాటిల్లిన వరిని పరిశీలిస్తున్న అధికారులు


సదాశి వనగర్‌లో..

ఐకేపీ కార్యాలయంలో ఎక్స్‌టర్నల్ ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో ఎక్స్ టర్నల్ ఆడిట్ అధికారులు నిర్వహించారని ఏపీఎం సత్యనారాయణ తెలిపారు. మండలంలోని 30 గ్రామ సంఘాల ఎక్స్ టర్నల్ ఆడిట్, మండల ఆడిట్ నిర్వహించారని అన్నారు. మండలంలోని గ్రామ సంఘాల అధ్యక్షకార్యదర్శులు వారు తమ సంఘం రికార్డులను మండల కేంద్రంలోని కార్యాలయానికి వచ్చి ఆడిట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఆర్ అసోసియేటడ్ ఆడిటర్‌గా నర్సారెడ్డి, రాజారెడ్డి, ప్రసాద్, సతీష్ అరవింద్, సిసిలు సావిత్రి, సంజీవ్, అంజయ్య, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే అన్ని సాధించాలి


మాట్లాడుతున్న భట్టు విఠల్

నవతెలంగాణ-గాంధారి

ముదిరాజులు ఐక్యతతో ఉన్నపుడే అన్ని విజయాలు సాధించవచ్చని జిల్లా అధ్యక్షులు భట్టువిఠల్ ముదిరాజ్ అనానరు. గాంధారి మండల కేంద్రంలో బుధవారం శ్రీ పెద్దమ్మ తల్లి పండగ ఉత్సవాలను బుధవారం ప్రారంభించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎంపీటీసీ తూర్పు రాజులు ముదిరాజ్, మండల అధ్యక్షులు రెడ్డి రాజులు ముదిరాజ్, ఎంపీటీసీ బాలరాజు ముదిరాజ్, మాజీ మండల అధ్యక్షులు బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి


వినపతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్) నాయకులు బుధవారం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ప్రకాష్ మాట్లాడుతూ రైతులకు పండించిన మొక్కజొన్న, వరి, కూరగాయలు ఈదురుగాలులతో ఉరుములతో కురిసిన అకాల వర్షానికి రైతుల చేతికి అంది వచ్చిన పంట నీటిపాలు అయిందని తెలిపారు. తక్షణమే అన్ని గ్రామ పంచాయతీలో వీఆర్ఏ ద్వారా సర్వే చేయించి నిజమైన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని, వర్షానికి తడిచి నల్లగ మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె ప్రకాష్, శ్రీనివాస్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యమూ కొనాలి

నవతెలంగాణ-నవీపేట్

అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్‌సింగ్ డిమాండ్ చేశారు. మండలంలోని రాంపూర్, ఎల్‌కె ఫారం, దర్యాపూర్ తాండ, శివారుల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దేవేందర్‌సింగ్ మాట్లాడుతూ.. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంట నష్టం తీవ్రంగా ఉందని అన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలుచేసి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

నవిపేట్ : అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని, ఎకరానికి 50వేల నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో తడిసి ముద్దైన ధాన్యం కుప్పలను, వర్షాలకు నేలనొరిగిన పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ రైతులు ఐదు రోజుల కిందటే ధాన్యాన్ని కోసి ఆరబెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుమ్ముల గంగాధర్, సహాయ కార్యదర్శి పుట్ట నడిపి నాగన్న, రైతులు ఐలాపురం నర్సయ్య, సుధాకర్, సంతోష్, రాజన్న, నర్సయ్య ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


భిక్కనూర్ : కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పెద్దమల్లారెడ్డి సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-పిట్లం/సదాశివనగర్/భిక్కనూర్/ఎల్లారెడ్డి


ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చిన్నకొడప్‌గల్ సింగిల్విండో చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. సింగిల్ విండో పరిధిలోని కాటేపల్లి, బుర్నాపూర్, పారడ్ పల్లి గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మి , సర్పంచులు బొడ్యం విట్టల్, ప్రవీణ , గుంట బాలమని , ఏ ఈ ఓ లు సురేష్ , సీఈవో హన్మాండ్లు , రైతులు పాల్గొన్నారు.

సదాశివనగర్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. మండలంలోని పద్మాజివాడి సొసైటీ పరిధిలోని మెడేగామలో బుధవారం ఎంపీపీ గైని అనసూయ, జెడ్పిటిసి కమిలి నరసింహులుతో కలిసి సొసైటీ చైర్మన్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమలవ్వ, మండల అధ్యక్షులు బొలిపల్లి మహేందర్ రెడ్డి, ఎంపీటీసీ సుజాత, వైస్ చైర్మన్ కుంట శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, ఉప సర్పంచ్ రాజు, కార్యదర్శి దేవేందర్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్: మండలంలోని పెద్దమల్లారెడ్డి సింగిల్ విండో సొసైటీ అధ్వర్యంలో పెద్ద మల్లారెడ్డి, కంచర్ల, ఇసన్నపల్లి గ్రామాలలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ బాలగోని రాజా గౌడ్ ప్రారంభించారు. దురదృష్టవశాత్తు అకాల వర్షం వల్ల మండలంలో పంట నష్టం జరిగిందని, ప్రభుత్వ విప్ సహకారంతో పంట నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పట్లూరి హనుమంత్ రెడ్డి, సింగిల్ విండో సొసైటీ వైస్ చైర్మన్ గుడిసె విట్టల్, పెద్ద మల్ల రెడ్డి సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, కంచర్ల సర్పంచ్ చంద్రకళ మాధవరెడ్డి,ఇసన్నపల్లి సర్పంచ్ గుడిసె రాములు, సింగిల్ విండో సొసైటీ డైరెక్టర్లు, సిఈఓ మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం.,లి.ఎల్లారెడ్డి అధ్యక్షులు ఏగుల నర్సిములు తన సంఘ పరిధిలో భిక్కనూర్, శివపూర్‌లో కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసి అధ్యక్షులు శ్రీ కాశీ నారాయణ సొసైటీ డైరెక్టర్ గోపికృష్ణ సుకెందర్‌రెడ్డి, నారాయణ ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ సాయిలు ఆయా గ్రామాల సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి భూమయ్య అగ్రికల్చర్ ఏ ఈ ఓ ముఖిద్ రైతులు సొసైటీ సీఈవో విశ్వనాథం సత్యనారాయణ మల్లయ్యస్టాఫ్ మల్లయ్య ఇంచార్జులు వున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జుక్కల్

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. జుక్కల్ ఎస్సై మురళి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చందర్‌గొండ అనే వ్యక్తి మద్యానికి బానిసైయ్యాడు. భార్య , కొడుకుతో గొడవ పడి అలిగి గ్రామ శివారులోని బసవన్న చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి గుంతలో పడి మృతిచెందాడు. మృతుడికి ఈత రాక పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రుక్మవ్వ ఫిర్యాదు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేపట్టాలి

నవతెలంగాణ-పిట్లం

ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తహసీల్దార్ మోహన్‌రావు ఆదేశించారు. బుధవారం మండలంలోని చిల్లర్గిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అకాల వర్షాల కారణంగా తడిసి ముద్దవుతున్న తరుణంలో రైతులు లబ్ధి కోసం కొనుగోలు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన ఏర్గట్ల విద్యార్థినులు



నవతెలంగాణ-ఏర్గట్ల

ఈ నెల 29, 30న విశాఖపట్నంలో జరగబోయే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఏర్గట్ల మండలకేంద్రానికి చెందిన విద్యార్థినులు జాగృతి, అస్నియా భాను, లతికను ఎంపికనట్లు కరాటే మాస్టర్ జగిత్యాల జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలిపారు. జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ సంస్థ తెలంగాణ వ్యవస్థాపకులు ఎమ్మెస్ పాషా ఆధ్వర్యంలో జరిగినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గ్రామస్థులు అభినందించారు.

కొనుగోలుకేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-భీంగల్

రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని బిజెపి జిల్లా నాయకుడు మల్లిఖార్జున్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలుకేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల ధాన్యం మొత్తం తడిసి చేతికొచ్చిన పంట నష్టపోయందని అన్నారు. ఇందుకు కారణం అయిన ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కడ్తా లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం ఫ్లెక్సీల మీద పెట్టిన ధ్యాస రైతుల కష్టాల మీద పెట్టడం లేదని అన్నారు. ఈయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్, , దయ్య ప్రవీణ్, యోగేశ్వర నర్సయ్య, సంగ్యానాయక్, నవీన్ తదితరులున్నారు.

విద్యుత్ ఏఈ నిర్లక్ష్యం చేస్తే ఎంపీడీవో పట్టించుకోరా?

- ప్రశ్నించిన సర్పంచులు, వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-వర్ని

పలుమార్లు మండల సర్వ సభ్య సమావేశంలో గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలపై ఇతర సమస్యలపై అధికారులకు సమస్యలు తెలుపుతున్నప్పటికీ పట్టించుకోవటం లేదని శ్రీనగర్ సర్పంచ్ రాజు, వైస్ ఎంపీపీ దండ్ల బాలరాజు సమావేశంలో అధికారులను నిలదీశారు. బుధవారం ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం కొనసాగింది. ఈ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంటూ చేపడుతున్న పనులను తెలిపారు. వ్యవసాయ విస్తీర్ణం అధికారి నగేష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ముందస్తుగా పంటలు చేతికి రావటంతో 80 శాతం వరకు కొనుగోలు అయిపోయాయని అన్నారు. మిగతా 20 శాతం ధాన్యం ఉందని, అకాల వర్షాలకు ధాన్యం తడిచినట్లైతే వారి పేర్లను స్వీకరిస్తూ ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతుబంధు రైతు బీమా ప్రతి రైతు కుటుంబాలకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. పశు వైద్యశాఖ అధికారులు మాట్లాడుతూ పశువులకు వేసవిలో వ్యాధుల బారిన



అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధి

పడకుండా పశువులకు మందులు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ నీటిని ఇంటింటికీ అందిస్తున్నట్లు అక్కడక్కడ కొన్ని సమస్యలు ఇప్పటికీ ఉన్న వాటిని సర్పంచుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలించడం పరిష్కరించడం చేస్తున్నామని మిషన్ భగీరథ శాఖ అధికారి సాత్విక తెలిపారు. గ్రామాల్లో విద్యుత్తు సమస్యలను తెలపడానికి విద్యుత్ ఏఈ సమావేశానికి హాజరు కాకపోవడంతో సర్పంచ్ రాజు, వైస్ ఎంపీపీ బాలరాజు అన్నారు. ఏఈ నిర్లక్ష్య ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, రైతు పంట చేలలో విద్యుత్ తీగలు, స్తంభాల సమస్యలపై పలుమార్లు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయరా... సర్పంచులుగా ఉన్న మేము ఎవరికీ చె ప్ప్ కో వా ల ని ఎంపీడీవోను నిలదీశారు. సమావేశానికి హాజరు కాకపోతే ఇప్పటివరకు ఎంతమంది అధికారులకు నోటీసులు జారీ చేశారో చూపించాలని ఎంపీడీవోను ప్రశ్నించారు. తాను విద్యుత్ అధికారిపై పలుమార్లు ఫోన్ చేసి చెప్పిపానని, కోర్టు కేసుతో రాలేకపోయారని తెలిపారన్నారు. ఇప్పటికీ మూడు సమావేశాలకు రాకపోతే ఏం చేశారని ప్రజాప్రతినిధులు అన్నారు. ఐకెపి ద్వారా రైతులు పంటచెలలో గడ్డిని కట్టలు కట్టుకునే మిషన్ అద్దెకు ఇవ్వబడుతుందని ఇలాంటి అవకాశాలను రైతులు వినియోగాంచుకోవాలని తెలిపారు. 30శాతం సబ్సిడీతో రైతులకు ధాన్యం శుభ్రపరిచే యంత్రం ఇవ్వబడుతుందని చెప్పారు. స్థానిక సర్పంచ్, ఎంపీపీ అధికారుల కృషితో బోధన్ నుంచి వర్ని వయా హైదరాబాద్ సిటీకి వెళ్లడానికి 20 ట్రిప్పులు బస్సులు వెళ్తున్నాయని అందులో ఐదు లగ్జరీ బస్సులు నడుపుతున్నామని, ఆర్టీసీ ద్వారా కార్గో సదుపాయంతో ఫోన్ ద్వారానే తమ వస్తువులను ఇంటికి చేరుకునేలా ఆర్టీసీ సేవలను అందిస్తున్నట్లు ఆర్టిసి అధికారులు తెలిపారు బోధన్ నుంచి నేరుగా బడాపహాడ్, గాంధారి వరకు మూడు ట్రిప్పులు బస్సులు వేసేలా చూడాలని జడ్పిటిసి హరిదాస్ అధికారులకు తెలిపారు. అధికారులతో మాట్లాడి వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, ఎంపీడీవో బసిరుద్దీన్, తాసిల్దార్ విట్టల్, జడ్పిటిసి హరిదాస్, వైస్ ఎంపీపీ బాలరాజు ,మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి నగేష్ రెడ్డి, ఎంఈఓ శాంతకుమారి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ గంగా కిరణ్, పిఎసిఎస్ చైర్మన్ నామాల సాయిబాబా, సర్పంచ్ల సంఘం అధ్యక్షులు నాని బాబు శ్రీనగర్ రాజు, వెంకన్న, ఎంపిటిసి గంగామణ, నారాయణ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలి

- ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల గుర్బాబాధి రోడ్డు లోని ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త మాట్లాడుతూ...ఇందూరు యువత స్వచ్ఛంధ సేవ సంస్థ సభ్యులు అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ గొప్ప మనసుని చాటుకుంటున్నారని అనారు. కరోన సమయంలో భోజనం పంపిణీచేశారని విధి వెక్కిరించిన వారిని ఆదరిస్తున్నారని తెలిపారు. వెన్నుదన్నుగా ఉంటూ సహాయసహకారాలు అందిస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్, దారం సాయిలు, సంస్థ సభ్యులు సాయిబాబు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణితంపై పట్టు సాదించాలి



మాట్లాడుతున్న రావుట్ల నర్సయ్య

నవతెలంగాణ-సిరికొండ

ప్రపంచ గణిత మేధావి, గణంకాల మాంత్రికుడు శీనివాస్ రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు గణితంపై పట్టు సాదించాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. ఁధవారం గణిత సిద్ధాంతాల సృష్టికర్త, ఫార్ములాల గాడ్ ఫాదర్ శ్రీనివాస రామానుజన్ 103వ వర్ధంతిని సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య శ్రీనివాస్ రామానుజన్ చిత్ర పటానికి పూలమాలనలంకరించి నివాళు లార్పించారు. ఈసందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.... ప్రస్థానం లేని కుటుంబంలో పుట్టిన రామానుజన్ కేవలం గణితంలో తనకున్న పట్టువల్లనే గుర్తింపు పొందాడని అన్నారు. అహర్నిశలు శ్రమించి, నవీన గణిత ఆవిష్కరణలు చేశారన్నారు. విద్యార్థులు గణితం పట్ల ఉన్న భయాన్ని వీడాలని, సాధనచేసి పట్టు సాధించి అనుకున్న లక్ష్యంలో విజేతలవ్వాలని తెలిపారు. పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే గణితందే ప్రధాన భూమికని అన్నారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని సమాజ వికాసంలో ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



ఎస్ఐ సన్మానిస్తున్న బజరంగ్ దళ్ సభ్యులు

నవతెలంగాణ - ముప్కాల్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముప్కాల్ ఎస్సై భాస్కర చారిని బుధవారం బజరంగ్ దళ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బజరంగ్ దళ్ సభ్యులు ఎస్సైని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన ఎస్సై భాస్కర చారి మాట్లాడుతూ యువత, యువజన సంఘం నాయకులు ప్రజలకు సమాజంపై అవగాహన కల్పిస్తూ సామాజిక సేవలను అందించాలని అన్నారు. కార్యక్రమంలో జక్కుల రాము, అభినవ్, సూరజ్, నరేష్, మనింద్రా, తేజ, విలాస్, శ్రీకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

పేదింటి పెళ్లికి అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త
- కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ

నవ తెలంగాణ-కంఠేశ్వర్

కల్యాణ లక్ష్మీతో ఆడబిడ్డలకు గౌరవమని, పేద, నిరుపేద సామ్యా ప్రజలకు వరంగా కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్, పేదింటి పెళ్లికి అండగా ఉందని, మహిళల భద్రతకు పెద్ద పీట వేసిందని, మహిళలకు రక్షణగా 24 గంటలు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఏ దేశంలో లేని విధంగా బృహత్తర పథకాలు ప్రవేశపెట్టారని, తాను ఎమ్మెల్యే గా ఉన్నంత కాలం వధువు-వరులకి నూతన వస్త్రాలు అందిస్తానని అన్నారు. బుధవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త న్యూ అంబేద్కర్ భవన్‌లో కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం -198 చెక్కులు రూ .1,98,22,968 అందజేశా మన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఐటి హబ్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త నిర్మాణంలో ఉన్న ఐటిహబ్ పనులని బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ పాల్గొన్నారు. దుబ్బ వైకుంఠ ధామం పనులను పరిశీలించారు. ఆయనతోపాటు మేయర్ దండు నీతూ కిరణ్ ఉన్నారు.



వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

అనుమతులులేని కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అనుమతులు లేని కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాం అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో అనుమతులు లేని కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజలి, రఘురాం మాట్లాడుతూ నిజామాబాద్ టౌన్, ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో నారాయణ, శ్రీ చైతన్య, ఆల్ఫోర్స్, అక్షర వంటి కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అడ్మిషన్లు తీసుకుంటూ వేలకు వేల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యా సంస్థలకు నోటీసులు ఇచ్చిన, ఎటువంటి ఫలితం లేకపోయిందన్నారు. అయినప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు నోటీసులను పట్టించుకోకుండా అడ్మిషన్లు నిర్వహించడం అంటే విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడగటమే అని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు లీజుకిస్తున్న స్కూల్ బిల్డింగ్ గుర్తింపుని రద్దుచేసి కార్పొరేట్ విద్యాసంస్థలపైన క్రిమినల్ కేసు పెట్టాలని అన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఉద్యమ కార్యాచరణ తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి సభ్యులు దినేష్, సుబోధ్, నగర సహాయ కార్యదర్శి నవీన్ కృష్ణ, నాయకుడు మమ్మద్ పాషా పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేతనాల పెంపు, పనిగంటల తగ్గింపుకోసం పోరాడుదాం

నవతెలంగాణ నిజామాబాద్‌సిటీ

కనీస వేతనాల పెంపుదల, సామాజిక భద్రత, పనిగంటల తగ్గింపుకోసం పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఆర్ భవన్, కోటగల్లిలో 138వ మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచాయన్నారు. కార్మిక వర్గానికి అందుతున్న వేతనాలతో కాలం గడపడం కష్టంగా మారిందన్నారు. అన్నిరంగాల కార్మికులకు శాస్త్రీయంగా వేతనాలను నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలు నిలిపివేతకు పోరాడుదామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను తిప్పికొడదమన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ కోసం ఉద్యమించాలన్నారు. 138వ మేడే ఉత్సవాల్లో కార్మిక లోకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి బీ.మల్లేష్, జిల్లా నాయకులు కిషన్, మురళి, సాయరెడ్డి, గంగాధర్, లక్ష్మణ్, రమేష్, రవి, బాలకిషన్, అతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న టీఎన్‌జీవో

- జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్

నవతెలంగాణ-భీంగల్

ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నది టీఎన్‌జీవోనే అని జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. బుధవారం పట్టణకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో యూనిట్ పూర్వ అధ్యక్షుడు రాజశేఖర్-డిప్యూటీ తహసీల్దార్-భీంగల్ ఆధ్వర్యంలో 2023, 2026 గాను నూతన కమీటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్ మాట్లాడారు. 1945 నుండి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తున్న సంఘం టీఎన్‌జీవో అని తెలిపారు. ఇందుకు ఉద్యోగులు సమిష్టింగా సంఘనికి అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగిపోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన ఎన్నికైన కమీటీ సభ్యులను సన్మానించారు కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్, సహధ్యక్షుడు చిట్టినారాయణ భీంగల్ మండల నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఇదే

అధ్యక్షులు రాజశేఖర్ (డిప్యూటీ తహసీల్దార్-భీంగల్), ఉపాధ్యక్షులు శ్రీనివాస్ (ఏపియం-భీంగల్), లక్‌పతి (ఏఈవో భీంగల్), ప్రశాంత్ (ఏఎస్‌వో మోర్తాడ్), గంగాజమున (కార్యదర్శి-కమ్మర్‌పల్లి), కార్యదర్శి నాగరాజు (సీనియర్ అసిస్టెంట్ ఎస్టీవో భీంగల్), సంయుక్త కార్యదర్శులు రవీందర్ (హెచ్‌డబ్ల్యూవో భీంగల్), ప్రసాద్ (సర్వేయర్ భీంగల్) ఉషారాణి , రమాదేవి (ఐసిడిఎస్ భీంగల్), కోశాధికారి టి శ్రీనివాస్ (ఐకెపి మోర్తాడ్), నరేష్ (ఐకెపి సిసి భీంగల్), ప్రచారకార్యదర్శి రవి (ఐకెపి సిసి వేల్పూర్) అమృత్‌రావ్ (జూనియర్ అసిస్టెంట్ కమ్మర్‌పల్లి) శరత్, కొమ్ము అశోక్ (డిగ్రీ కాలేజ్ మోర్తాడ్), హరిబాబు సీనియర్ అసిస్టెంట్ కమ్మర్‌పల్లి), మాణిక్యం (వార్డు అఫీసర్ మున్సిపల్ భీంగల్) లక్ష్మినారాయణ (జూనియర్ అసిస్టెంట్ సిరికొండ), జాకబ్ (జూనియర్ అసిస్టెంట్ ఏర్గట్ల) నరేష్ (వెటర్నరీ భీంగల్)లను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న అలుక కిషన్

28న జరిగే మహానీయులసభను విజయవంతం చేయాలి



మహనీయకుల జయంతి సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

బోధన్‌లో ఈనెల 28న జరిగే మహనీయుల జయంతి సభను విజయవంతం చేయాలని ఎంఎస్పి బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మానికోల్ల గంగాధర్ కోరారు. మండలంలోని కోస్లి గ్రామంలో మహనీయుల జయంతి సభ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28న బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో జరిగే మహనీయుల జయంతి సభకు మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని, కాబట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రొడ్డ స్వప్న, గంగాధర్, దుర్గయ్య, సంజీవ్, నర్సయ్య, మైసయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు

బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేందర్ గౌడ్



అభివాదం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ(ఆర్మూర్)

బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ అధ్యక్షులు అబ్బగోని అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో చలో బాల్కొండ అనే నినాదంతో బాల్కొండ మండల కేంద్రంలోని ఎంకే గార్డెన్‌లో బుధవారం బీసీల బహిరంగ సభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీసీల జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ ఎస్టీ లాగా బీసీలకు కూడా బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశంలో బీసీల జనాభా అత్యధికంగా ఉందని మరి బీసీల పట్ల చిన్నచూపు చూడడం తగదని బీసీలకు తగిన న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భారత దేశంలో బీసీల జనాభా లెక్కించాలని, వారి తమాషా ప్రకారం వాటా కల్పించాలని, విద్యా, వైద్య, ఉద్యోగ రంగాల్లో 57శాతం రిజర్వేషన్ ఉన్న బీసీలకు తప్పకుండా న్యాయం జరిగే విధంగా రిజర్వేషన్ల ప్రకారం కేటాయించాలని తెలిపారు. అదేవిధంగా కేంద్రంలో ప్రత్యేక బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో బీసీలకు అన్ని పార్టీలు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అబ్బ గోని అశోక్‌గౌడ్, తెలంగాణ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమనపల్లి విఠోబా, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిగాని భిక్షపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బొబ్బిలి నర్సయ్య, బాల్కొండ నియోజకవర్గం అధ్యక్షులు దాసరి మూర్తి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగడం వెంకన్న, తెలంగాణ బి సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు రాకేష్ యాదవ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సిరిసిల్ల టౌన్ అధ్యక్షులు సత్యనారాయణ, తెలంగాణ వేల్పూర్ మహిళా మండల అధ్యక్షురాలు ఇందర పుష్ప, ఏర్గట్ల మండల మహిళా అధ్యక్షురాలు నాగరాణి, బాల్కొండ నియోజకవర్గం ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, మండల ఉపాధ్యక్షులు రాజేందర్, సాయిలు, అర్జున్, కొప్పు రాజేందర్, మధు, డాక్టర్ మురళి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులు సమావేశానికి హాజరుకావాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

దరఖాస్తుదారులు సమావేశానికి హాజరుకావాలని జిల్లా యువజన క్రీడల అధికారి అన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాలమేరకు 10 వేసవి శిక్షణ శిబిరాలకు పిడి, పీఈటీ సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న ఒక ప్రకటనలో తెలిపారు. పిడీ, పిఈటీ, సీనియర్ క్రీడాకారుల నుండి 22 దరఖాస్తులు చేసినప్పటికీ సమావేశానికి దరఖాస్తు దారులు తక్కువ సంఖ్యలో హాజరు అయినందున సమావేశం రద్దు చేసినట్టు తెలిపారు. తిరిగి ఈనెల 28 న సాయంత్రం 4 గంటలకు, జిల్లా యువజన, క్రీడా కార్యాలయం, సుబాష్ నగర్, నిజామాబాద్‌లో వేసవి శిక్షణ శిబిరాల కొరకు దరఖాస్తుచేసిన 22 అభ్యర్థులతో సమావేశము నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారుల సమక్షంలో 10 వేసవి శిక్షణ శిబిరాలను దరఖాస్తుదారులచే ఖరారు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి ఒక్క దరఖాస్తుదారుడు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు లేనియెడల సమావేశానికి హాజరు కాని దరఖాస్తుదారుని ధరఖాస్తును పరిగనలోనికి తీసుకోబడదని పేర్కొన్నారు.

ఆర్చరీ కోచింగ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఆర్చరీ కోచింగ్ అందించనున్నట్టు జిల్లా యువజన, క్రీడల అధికారి జె.ముత్తెన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం లోని నాగారంలోగల రాజారాం స్టేడియంలో ఆర్చరీ ఖేలో ఇండియా ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారని పేర్కొన్నారు. వివరాల కోసం ఆర్చరీ కోచ్ ఎం.మురళిని నేరుగా లేదా 9848919480 సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని హుస్సేన్ నగర్, తాళ్లరామడుగు గ్రామాల శివారులో బుధవారం జరిగిన ప్రనమాదంలో ఒకరు మృతిచెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన దప్పు రాములు (55) జలందర్ ద్విచక్ర వాహనంపై ఘడ్కోల్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ప్రమాదవశాత్తు రామడుగు గ్రామానికి చెందిన గూండ్ల నర్సయ్య కి చెందిన వరి ధాన్యం కుప్ప పైకి దూసుకెళ్లడంతో వాహనం అదుపుతప్పి రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. జలందర్‌కు గాయాలు కావడంతో 108 లో జిల్లా కేంద్రానికి తరలించినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.